క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు, నీళ్లు రావడం లేదని 2, 3 వార్డుల ప్రజలు ఆందోళన చెందుతున్న విషయాన్ని 'అధికారుల నిర్లక్ష్యం.. ఎండుతున్న పంటలు' శీర్షికతో 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ ఏఈ జోగానంద్ చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం తొలగింపజేసి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరింపజేశారు. కార్యక్రమంలో సిబ్బంది బోడ శివ, శ్రీను, జీపీ కార్యదర్శి అవినాశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్‌కు సన్మానం



సంగెం : ఇటీవల నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఈసీ మెంబర్‌గా ఎన్నికైన న్యాయవాది తలకోట అశోక్‌ను తోటి న్యాయవాదులు బుధవారం సన్మానించారు. ఈ మేరకు మండలంలోని ఆశాలపల్లి గ్రామంలో వారు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మోహన్, రాజు, సిద్ధునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మోకుదెబ్బ మండల కన్వీనర్‌గా మల్లయ్య



చెన్నారావుపేట : గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ మండల కన్వీనర్‌గా చెన్నారావుపేటకు చెందిన గౌడిశాల మల్లయ్య గౌడ్‌ను నియమించినట్లు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. వారం రోజుల్లో పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకుంటామని చెప్పారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్, రాష్ట్ర నాయకులు సోల్తి సారయ్య, మద్దెల సాంబయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జూలూరు హరిప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి అభినందన

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకు ఆమె జన్మదినం సందర్భంగా తెలంగాణ అంబేడ్కర్ సంఘం, ఆ పార్టీ నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. తొలుత అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు బోయిని రవికుమార్ యాదవ్, తదితరులు కావ్యను ఎమ్మెల్యే, ఆమె తండ్రి శ్రీహరి సమక్షంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నివాళి

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన సూదిని చంద్రారెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్, బిల్ల ఇంద్రసేనారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీశ్, రూపిక శ్రావణ్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని ఊకల్ హవేలీ గ్రామానికి చెందిన డక్క కనకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి బుధవారం రూ.3 వేల సాయం అందజేశారు. ఈ మేరకు నగదును ఆ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు కక్కెర్ల సుభాశ్, నకినబోయిన నాగరాజు, చింటు, క్రాంతి ద్వారా బాధిత కుటుంబానికి బాలకిశోర్‌రెడ్డి పంపించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పట్టణంలో తాగునీటికి తండ్లాట

● బిందెలు, బకెట్లతో మహిళల నిరసన

జల ఘోష



బిందెలు, బకెట్లతో నిరసన తెలుపుతున్న మహిళలు

నర్సంపేట : నర్సంపేటలోని కాకతీయ కాలేజీ, 8వ వార్డులోని నెహ్రూ నగర్‌లో తాగునీటి కోసం తండ్లాట తప్పడం లేదు. లక్షలు వెచ్చించి నూతన భవనాలు నిర్మించుకుని అనుమతులు తీసుకున్నా మున్సిపల్ అధికారులు తాగునీరు కూడా అందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిషన్ భగీరథ పైపులు వేసి నిర్లక్ష్యంగా వదిలేసిన దుస్థితి నెలకొంది. మూడేళ్లు గడుస్తున్నా తాగునీరు రాక మహిళలు అరిగోస పడుతున్నారు.

బిందెలు, బకెట్లతో రోడ్డుపై మహిళల నిరసన

మున్సిపల్ పైపులైన్ వేసి తాగునీరు అందించాలని, మిషన్ భగీరథ పైపులకు కనెక్షన్లు ఇచ్చి సమస్య పరిష్కరించాలని కోరుతూ నెహ్రూనగర్‌కు చెందిన శ్రీదేవి, సునీత, పద్మ, రమ్య, అన్నపూర్ణ, రమ, మౌనిక, లలిత, వెంకటమ్మ, సక్కుబాయ్, రాధ బుధవారం బిందెలు, బకెట్లతో రోడ్డుపై నిరసన తెలిపారు. నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, కులాయి నీరు రావాలని నినాదాలు చేశారు.

లక్షలు వెచ్చించి ఇల్లు నిర్మించుకున్నాం



లక్షలాది రూపాయలు వెచ్చించి ఇంటిని నిర్మించుకున్నాము. బోరు వేస్తే పడలేదు. దీంతో రెండో అంతస్తు నిర్మాణం చేపట్టలేదు. ఆర్నెళ్ల క్రితం మిషన్ భగీరథ పైపులను వేసి నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటివరకు అధికారులు ఆ దిశగా కన్నెత్తి చూడలేదు. మిషన్ భగీరథ నీరు అందించి ఆదుకోవాలి.

-శ్రీదేవి, గృహిణి, నెహ్రూనగర్

రూ.10 వేల పన్ను కడుతున్నా..



మున్సిపాలిటీకి ఏటా సుమారు రూ.10 వేలకుపైగా పన్ను కడుతున్నా అధికారులు నీటి వసతి కల్పించడం లేదు. దాదాపు రూ.2 లక్షలు వెచ్చించి ప్రయత్నించినా రెండు బోర్లు పడలేదు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. నల్లా కనెక్షన్ ఇప్పించి తాగునీరు అందించాలి.

-అన్నపూర్ణ, ఉపాధ్యాయురాలు

తాగునీటి సమస్య పరిష్కరించాలి



కాలనీలో బోరు బావులు పడక నీటి కొరత తీవ్రంగా ఉంది. మున్సిపల్ అనుమతి తీసుకుని నిర్మాణాలు పూర్తి చేసినా వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి.

-పద్మ, గృహిణి, నెహ్రూనగర్

అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటు

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : నర్సంపేట నియోజకవర్గంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లకు సహకరించకుండా అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.200.51 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసిన నిధులు ల్యాప్స్ కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరెడ్డిపైనే ఉందన్నారు. అధికారులతో సమీక్షించి అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్లబెల్లి మండలంలో 14 బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించడం లేదో ప్రజలకు చెపాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పలు గ్రాంట్ల ద్వారా నిధులు మంజూరు చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినా కాంట్రాక్టర్లు పనులు చేస్తున్న దాఖలాల్లేవని ఆందోళన వెలిబుచ్చారు. సుమారు 160 గ్రామాలను అనుసంధానం చేస్తూ 165 కిలోమీటర్ల నిడివిగల బీటీ రోడ్ల నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. వెంటనే బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన తప్పదన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి మోహన్‌రావు, నాయకులు బానోత్ సారంగపాణి, కొత్తపల్లి కోటిలింగాచారి, ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్, గందె శ్రీనివాస్ గుప్తా, నానెబోయిన రాజారాం, మామిండ్ల మోహన్‌రెడ్డి, మాలోత్ ప్రతాప్‌సింగ్, శివాజీ, మామిండ్ల మోహన్‌రెడ్డి, వక్కల చంద్రమౌళి, నాగెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని వెంచర్లపై చర్యలు

● ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్

నెక్కొండ : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అనుమతులు లేని వెంచర్లపై చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆయన అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గ్రామ సభలో అక్రమ వెంచర్లపై పలువురు గ్రామస్తులు అధికారులను నిలదీశారు. వెంచర్లలో గ్రీన్‌ల్యాండ్ ఎక్కడుందో తెలియడం లేదన్నారు. జీపీ అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. గ్రీన్ ల్యాండ్‌లను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అక్రమ వెంచర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేసి దారులు వేసి మొరంతో లెవెల్ చేస్తుండడంతో సమీప రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనుమతులు లేని వెంచర్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ప్రహరీలను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడారు. నెక్కొండ–అప్పల్‌రావుపేట దారిలోని ఓ వెంచర్‌కు అనుమతి ఉందన్నారు. గ్రీన్ ల్యాండ్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించామని తెలిపారు. అక్రమ వెంచర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సదానందంను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గతంలో పాలకవర్గం చేసిన అభివృద్ధి పనుల బిల్లులు, జీపీ అధికారుల పెండింగ్ బిల్లులు చెల్లించేలా గ్రామ సభ తీర్మానం చేసింది.

విద్యార్థుల్లో చైతన్యానికి 'లీడ్' చొరవ



విద్యార్థులతో డాక్టర్ మోహన్‌రావు, తదితరులు

నర్సంపేట : విద్యార్థుల్లో చైతన్యం పెంచే దిశగా లీడ్ లైబ్రరీ అండ్ లిటరరీ సెంటర్ చొరవ తీసుకుంటోందని సంజీవని ఆశ్రమ చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు వినోద, సీనియర్ కవి కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి తెలిపారు. ఉగాది సందర్భంగా పట్టణంలోని సంజీవని ఆశ్రమంలో లీడ్ లైబ్రరీ అండ్ లిటరరీ సెంటర్ వ్యవస్థాపకుడు, ప్రముఖ కవి కాసుల రవికుమార్ అధ్యక్షతన మంగళవారం రాత్రి నిర్వహించిన బాల కవి సమ్మేళనానికి మోహన్‌రావు వినోద, యాకూబ్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ప్రకృతి, సెల్‌ఫోన్ ప్రభావం'పై విద్యార్థులు రాసిన కవితలు చదివి వినిపించారు. అనంతరం కవి యాకూబ్‌రెడ్డి మాట్లాడారు. 'సృజనాత్మక ప్రక్రియ–కవిత్వం' అంశంపై విద్యార్థులకు వివరించారు. కాళోజీ నారాయణరావు, అలిశెట్టి ప్రభాకర్ రాసిన కవితలను ఉదహరించారు. కవితలు రాసి ప్రతిభ చాటిన విద్యార్థులు ప్రియాంక, శిరీష, సింధు, భరత్‌కుమార్, పవిత్రలను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. కవితా గానం చేసిన విద్యార్థులందరికీ పుస్తకాలు బహూకరించారు.

'ఉపాధి' పనులపై సమీక్ష

దుగ్గొండి : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఎంపీడీఓ లెక్కల అరుంధతి బుధవారం సమీక్షించారు. గ్రామాల వారీగా కూలీల, పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు చెప్పారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసే దిశగా కూలీలను చైతన్యవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ రాజు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ఖానాపురం : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ ఆంజనేయులు



నెక్కొండ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ సురేశ్

ఖానాపురం : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ సీఈఓ ఆంజనేయులు స్పష్టం చేశారు. మండలంలోని ఖానాపురం, అశోక్‌నగర్, మంగళవారిపేట, ధర్మరావుపేట, తదితర గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్వింటా ‘ఏ’ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, కామన్ రకాన్ని రూ.2183 చెల్లిస్తుందని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సూకల సంతోశ్, నాగరాణి, సంధ్య, రాజ్‌కుమార్, సొసైటీ సిబ్బంది మేరుగు రాజు, వినయ్, వెంకటేశ్వర్లు, అశోక్, కొంరయ్య, భీమయ్య, సర్వర్, ఐలోని తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని పెద్దకోర్పోలు, చిన్నకోర్పోలు, నాగారం, దీక్షకుంట గ్రామాలతోపాటు నెక్కొండ మార్కెట్‌లో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను సీఈఓ మోడెం సురేశ్ ప్రారంభించి మాట్లాడారు. రైతుల సౌలభ్యం కోసం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి కృష్ణమీనన్‌రావు, ఏఈఓ వసంత పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కాపుల కనపర్తి, తీగరాజుపల్లి, షాపూర్ గ్రామాల్లో పౌర సరఫరాలు, సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ లావణ్య ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ రమణాచారి, సెంటర్ ఇన్‌చార్జ్‌లు మాలతి, భిక్షపతి, నవీన్ పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

నర్సంపేట : కుల, మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం కోరారు. పట్టణంలోని ఆ యూనియన్ పట్టణ అధ్యక్షుడు మెరుగు జనార్దన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశానికి మల్లేశం అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 రకాల చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు. కార్మికులను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా చేసే బీజేపీ తీరును వ్యతిరేకించాలని కోరారు. మతోన్మాదంతో మైనార్టీలు, దళితులు, ఆదివాసీలపై దాడులకు పాల్పడుతూ దేశంలో భయానక వాతావరణం కల్పిస్తోందని మండిపడ్డారు. రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేస్తూ కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక, కర్షక ఐక్యతతో మే1న 139వ మే డేను ఉత్సాహంగా జరుపుకుని కార్మిక వర్గ ఐక్యతను చాటాలని కోరారు. సమావేశంలో నాయకులు ఇప్ప బాబన్న, దేవసాని సాంబయ్య, కుమారస్వామి, కొనమాల నర్సింగం, యాకయ్య, సదానందం, అశోక్, ఐలయ్య, మధు, కుమార్ పాల్గొన్నారు.

సత్తెమ్మ జాతర



పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌లో సత్తెమ్మ జాతర బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ నాయక్, రవీందర్, కుమారస్వామి, రాజేందర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా మద్దతు

● ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య



మహేశ్‌కుమార్‌తో మాట్లాడుతున్న సాంబయ్య

నర్సంపేట : రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు గుణపాఠం చెప్పి రాజ్యాంగాన్ని పరిరక్షించే లక్ష్యంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) బొజ్జ తారకం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సాంబయ్య మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ ఫలాలు బహుజనులకు పూర్తి స్థాయిలో దక్కాలంటే పేదల పక్షపాతిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌తోనే సాధ్యమని భావిస్తున్నట్టు చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తామన్నారు.

ఓటు వినియోగం తప్పనిసరి



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ సారయ్య

నర్సంపేట రూరల్ : రానున్న లోకసభ ఎన్నికల్లో అర్హులందరూ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని మండల నోడల్ ఆఫీసర్ కొర్ర సారయ్య కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, స్వీప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల వయసు కలిగిన ప్రతీఒక్కరు ఓటు వేసేలా చైతన్యవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం రజిత, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎం మహేందర్, ఏఈఓ రత్నమాల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని మస్జిద్ -ఏ-మహ్మదీయ మసీద్‌లో కాంగ్రెస్ నాయకులు బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తొలుత నమాజ్ చేశారు. అనంతరం ఖర్జూర, అరటి, అంగూర, ఆపిల్, పుచ్చకాయలతో ఇఫ్తార్ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ననుమాస వీరస్వామి, పోలెపల్లి భిక్షపతి, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కానూరి వెంకటేశ్వర్‌రావు వర్ధంతి



వెంకటేశ్వర్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు (తాత) 9వ వర్ధంతి నిర్వహించారు. వెంకటేశ్వర్‌రావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ మాట్లాడారు. వెంకటేశ్వర్‌రావు 1945లో 20 ఏళ్ల చిరుప్రాయంలోనే సాంప్రదాయ కళారంగం నుంచి ప్రజానాట్య మండలిలోకి ప్రవేశించినట్టు తెలిపారు. కళారంగమే శ్వాసగా బతికారని చెప్పారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గడ్డి కృష్ణ, మల్లన్న, రమేశ్, ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి కుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క, శారద, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : మండలానికి చెందిన 30 మంది పేద ముస్లింలకు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి–సోను దంపతులు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం రూ.1500 చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నగదు పంపిణీ చేసి మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచానికే ఆదర్శమన్నారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత గురువు రషీద్ అన్వర్, నాయకులు నానబోయిన రాజారాం, కొత్తపల్లి కోటిలింగాచారి, ముస్లిం మతపెద్దలు నన్నే సాహెబ్, సద్దాం, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని కమ్మపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సాంబరాతి మల్లేశం సతీమణి మమత ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి, కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి బుధవారం పరామర్శించారు. తొలుత మమత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నాగెల్లి కొమురయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, నాయకులు కొట్టె సదానందం, తదితరులు పాల్గొన్నారు.

రూ. 42,870 విలువైన మద్యం సీజ్

చెన్నారావుపేట : మండలంలోని మగ్దుంపురం గ్రామంలో బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో కొమ్మరాజు, ఎం అమీర్, అంగోతు వెంకట్ నుంచి రూ. 42,870 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడుల్లో సీఐ సార్ల రాజు, ఎస్సై నిసర్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు

గీసుకొండ : మండలంలోని మనుగొండ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ శ్రావ్య భర్త, బీఆర్‌ఎస్ నాయకుడు రడం భరత్‌పై ఎన్నికల సంఘం అధికారి డాక్టర్ నారాయణ ఫిర్యాదు మేరకు పరకాల సీఐ రవిరాజ్ కేసు నమోదు చేశారు. వివరాలిలా.. భరత్ గతంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వ్యవహరించారు. కొండా మురళి వర్గ నాయకుడిగా ఆయనకు పేరుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన సతీసమేతంగా నాటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో భరత్ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈనెల 7న మండలంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ముఖ్యఅతిథిగా సమావేశం నిర్వహించడానికి పోలీసులు, ఎన్నికల అధికారుల నుంచి అనుమతి తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా భరత్ బీఆర్‌ఎస్ నాయకుడని, కాంగ్రెస్ శ్రేణుల మధ్య అయోమయం సృష్టించేందుకే అలా చేస్తున్నాడని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి కొమురారెడ్డి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సమావేశానికి అనుమతి ఇవ్వకపోవడమే కాకుండా భరత్‌పై కేసు నమోదు చేశారు.